# ప్రజాశక్తి

మంగళవారం 6 ఆగస్టు 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# పరిష్కార వేదికలో... అపరిష్కృత సమస్యలు



క్యూలో అర్జీదారులు(ఫైల్ ఫోటో)

- తరచూ భూ సంబంధిత సమస్యలతో కలెక్టరేట్‌కు రాక
- పోలీసు, రెవెన్యూలో సమన్వయ లేమి
- బాధితులకు తప్పని తిరుగులు
- ఆగని రియల్ ఎస్టేట్ మోసాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో భూ సమస్యలు తీరడంలేదు. ప్రభుత్వమేది మారినా పేద, సాధారణ రైతులకు బాధలు తప్పడంలేదు. పొలం పనులు, కూలి పనులు వదులుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న అర్జీల్లో 60 శాతానికి పైగా భూ సంబంధిత సమస్యలే ఉంటున్నాయి. భూ సమస్యల్లో దొర్లిన పొరపాట్లు, తప్పులను సరిదిద్దే ప్రయత్నం ప్రభుత్వ యంత్రాంగం మనస్ఫూర్తిగా చేయకుండా, తమకున్న పరిమితులు చెప్పుకొని తప్పించుకోవడంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకక బాధితులు అనేక అవస్థలుపడుతున్నారు. ఎన్నిసార్లు తిరిగినా పరిష్కారం కాక బాధితులకు వేరే దారి లేక ప్రతి సోమవారమూ కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనకు వస్తూనేవున్నారు. రికార్డుల్లో పేర్లు సరిచేయడం, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, వేరే సర్వే నెంబర్లతో భూములు అమ్మడం, ఒకే భూమి వేర్వేరు వ్యక్తులకు విక్రయించడం, పాస్‌బుక్‌ల మంజూరుకు ఇబ్బందులు పెట్టడం వంటి అనేక సమస్యలతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇవ్వడానికి బారులుకడుతున్నారు. తప్పుడు సర్వే నెంబర్లతో భూమి అమ్మడం, ఒకే భూమి వేర్వేరు వ్యక్తులకు విక్రయించడంతో మోసపోయిన బాధితులు ఎక్కువ మంది ఉన్నారు. తమ పరిధిలోకి రావని రెవెన్యూ అధికారులు చెబితే, సివిల్ కేసుల పరిధిలోకి వస్తాయని పోలీసులు తప్పించుకోవడంతో బాధితులకు తిరుగులు తప్పలేదు.

ఈ తరహా అర్జీలే ప్రతి వారమూ వస్తున్నా, వాటి తీవ్రతను గుర్తించి అటు రెవెన్యూ, ఇటు పోలీసుశాఖ సమన్వయంతో ఆ సమస్యలను పరిష్కరించడానికి చొరవ

మిగతా 2లో..

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలు విభాగాల వారీగా...**

| పరిష్కారవేదిక | మొత్తం అర్జీలు | రెవెన్యూ,సర్వే | పోలీసు |
|---|---|---|---|
| 1.7.2024 | 136 | 92 | 10 |
| 8.7.2024 | 303 | 193 | 25 |
| 15.7.2024 | 247 | 161 | 19 |
| 22.7.2024 | 175 | 116 | 13 |
| 29.7.2024 | 283 | 182 | 15 |

# నేడు స్థానిక ఎమ్మెల్సీ ఉపఎన్నికల నోటిఫికేషన్

- 13 వరకూ నామినేషన్లు, ◆ 14న స్క్రూటినీ,
- 16న ఉపసంహరణ ◆ 30న పోలింగ్,
- సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు
- జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం విడుదలవుతుందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. నోటిఫికేషన్ జారీ నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 13వ తేదీ వరకు కొనసాగుతుందని (ప్రభుత్వ సెలవు దినములు మినహా) కలెక్టర్ చెప్పారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపాలిటీ సభ్యులు ఓటర్లుగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, జిల్లా రెవిన్యూ అధికారి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటన గత నెల 30న విడుదలైందని, అప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 6న, నామినేషన్ల స్వీకరణ 13వ తేదీ వరకు ఉంటుందని, 14వ తేదీన స్క్రూటినీ జరుగుతుందని తెలిపారు. 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, అనంతరం ఎన్నికల బరిలో ఉన్న తుది అభ్యర్థుల వివరాలను

మిగతా 2లో..

## స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

వార్త 5లో..

## రణధీర్ కుటుంబాన్ని పరామర్శించిన నర్సింగరావు

వార్త 8లో..

## డిఎస్‌సి, టెట్‌పై 7న ఉచిత అవగాహన

వార్త 8లో..

## త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

వార్త 4లో..

**పాత సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ జాయినింగ్ వ్యవహారంపై...**

# కెజిహెచ్‌లో హైడ్రామా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లైంగిక ఆరోపణలు ఎదుర్కొని, పోలీస్ కేసు నమోదు కాబడిన పాత సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ జాయినింగ్ వ్యవహారంపై కెజిహెచ్‌లో సోమవారం గందరగోళం తలెత్తింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ చేయాల్సి ఉండగా, నేరుగా ఆయన కెజిహెచ్‌కు వచ్చి జాయిన్ కావటాన్ని, ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అభ్యంతరం తెలిపారు. గత సూపరింటెండెంట్ అశోక్ కుమార్ సెలవుపై వెళ్లడంతో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డాక్టర్ శివానంద్ కొనసాగాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో ఎటువంటి ఉత్తర్వులూ లేకుండా నేరుగా వచ్చి జాయిన్ కావడంపై ఏమిచేయాలో తెలియక ఉన్నతాధికారులను కెజిహెచ్ అధికారులు వివరణ కోరారు. అందుకు సమాధానం రాలేదు. ఏదైనా ఉద్యోగి చిన్న తప్పు చేస్తే నానా హడావుడి చేసే డిఎంఇ అధికారులు ఈ విషయంపై నోరు మెదకపోవడం వెనుక అవినీతి దాగుందంటూ చర్చ సాగుతోంది. డ్రాయింగ్ ఆఫీసర్ హోదాలో 14 రోజులు సెలవు పెడితే ఖచ్చితంగా ఉన్నతాధికారులు అనుమతి తీసుకోవాల్సి ఉందని కెజిహెచ్ అధికారులు అంటున్నారు. రెండు నెలలు సెలవులో ఉన్న వ్యక్తి రీపోస్టింగ్ ఆర్డర్ లేకుండా నేరుగా వచ్చి ఎలా జాయిన్ అవుతారంటూ కెజిహెచ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కనీసం డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీ కూడా లేకుండా రీపోస్టింగ్ ఎలా ఇస్తున్నారన్న విషయంపై నోరు మెదపని డిఎంఇ అధికారులు తీరు విస్మయం కలిగిస్తోంది. ప్రజా ప్రతినిధులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, మళ్లీ అదే వ్యక్తికి కీలకమైన విభాగం కేటాయించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జాయినింగ్ ఆర్డర్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోనంటూ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ శివానంద్ స్పష్టంగా చెప్పడం విశేషం. దీంతో విధిలేక గంటపాటు నిరీక్షించిన పాత సూపరింటెండెంట్ అశోక్ కుమార్ వెలుపలకు వెళ్లిపోయారు.

# స్థానిక ఎమ్మెల్సీ బరిలో ప్రధాన పార్టీలు

- వైసిపి నుంచి బొత్స
- టిడిపి నుంచి పరిశీలనలో ఇద్దరి పేర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల వేడి మొదలైంది. మంగళవారం నోటిఫికేషన్ వెలువడనుంది. ప్రధాన రాజకీయ పార్టీలు కూటమిలోని తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి రెండూ ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తలపడనున్నాయి. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలో ఉండడంతో ఈ ఎన్నికల్లోనూ పైచేయి సాధించడం కోసం శతవిధాలా ప్రయత్నాలను ఆ పార్టీల నేతలు చేపట్టారు. వైసిపి నుంచి ఇప్పటికే అభ్యర్థి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించగా, టిడిపి ఇంకా తర్జన భర్జనలో ఉంది. ప్రధానంగా ఇద్దరు నేతలు బరిలో ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, మరో నాయకుడు పీలా గోవింద సత్యనారాయణ పోటీ పడుతున్నారు. అధిష్టానం గండి బాబ్జీ వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

**ఓట్లు...ఓటర్లు...**

ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్ సభ్యులు (కార్పొరేటర్లు) అంటే ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు ఈ ఎన్నికల్లో ఓటర్లు. ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు 2027 వరకే ఉంటారు. గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ పార్టీ మారడంతో అనర్హతకు గురికావడంతో ఈ ఎన్నికకు ఆస్కారమేర్పడింది.

మున్సిపాల్టీ, కార్పొరేషన్లలో ఎక్స్‌అఫీషియో సభ్యులు అంటే ఎంపీలు, రాజ్యసభ సభ్యులూ ఓటర్లే. ఎమ్మెల్సీ ఎన్నికకు 838 ఓట్లతో జాబితాను యంత్రాంగం సిద్ధం చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 652 మంది ఎంపిటిసిలకు గానూ 16 ఖాళీగా ఉన్నాయి. 39 జెడ్‌పిటిసిలకుగానూ 3 ఖాళీగా ఉన్నాయి. 98 కార్పొరేషన్ వార్డులకు గానూ ఒక స్థానం ఖాళీగా ఉంది. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్‌లు కలిపితే 822 మంది ఓటర్లు మొత్తంగా ఉన్నారు. విశాఖపట్నం జిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, విశాఖ, అనకాపల్లి 2 లోక్‌సభ ఎంపీలు, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీలు రవీంద్రబాబు, డి.రామారావు, వేపాడ చిరంజీవిరావు జివిఎంసిలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. వీరికీ ఓటుంటుంది. నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాల్టీల్లో కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. మొత్తం 16 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## పరిష్కార వేదికలో అపరిష్కృత సమస్యలు

చూపకపోవడంతో మోసగాళ్లకు ఊతమిచ్చినట్లవుతుంది. దీంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ మోసాలను యథాతథంగా కొనసాగిస్తున్నారు. వీటిని అలుసుగా తీసుకొని మోసగాళ్లను వెనుకేసుకొస్తూ కొంతమంది పోలీసు, రెవెన్యూ అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. భూ సంబంధిత సమస్యలు అనకాపల్లి, పరవాడ, అచ్యుతాపురం, సబ్బవరం, యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి మండలాల్లో ఎక్కువగా వస్తున్నాయి. 22ఎలో పెట్టిన ప్రయివేటు భూములను తిరిగి డి నోటిఫై చేసేందుకు పెడుతున్న బాధలు అన్నీఇన్నీకావు. పరవాడ మండలం దేశపాత్రునిపాలెం వుడా లే-అవుట్‌లోని ఇంటి స్థలాన్ని 22ఎలో చేర్చి, డి నోటిఫిచేయకుండా దాదాపు ఐదేళ్లుగా ఒక వ్యక్తిని తిప్పుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు ప్రజా సమస్యల పరిష్కార వేదికలు జరిగాయి. ప్రతి వారమూ వచ్చిన మొత్తం అర్జీల్లో 60 శాతానికిపైగా భూ సంబంధిత సమస్యలే అధికంగా ఉన్నాయి.

జూన్ ఒకటిన వచ్చిన 136 అర్జీల్లో రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించినవి 92 ఉండగా, 8న వచ్చిన 303 అర్జీల్లో 195 ఈ రెండు శాఖలకు సంబంధించినవే ఉన్నాయి. ఈ రెండు శాఖల తరువాత అర్జీలు ఎక్కువగా పోలీసు శాఖకు సంబంధించి వస్తున్నాయి. మిగిలినవి 35 శాఖలకు చెందినవి ఉంటున్నాయి.

## నేడు 'స్థానిక' ఎమ్మెల్సీ ఉపఎన్నికల నోటిఫికేషన్

వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఈవిఎంలు ఉండబోవని, బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తామని తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, పోలింగ్ కేంద్రాల వివరాలు రెండు రోజుల్లో తెలియజేస్తామని చెప్పారు. సెప్టెంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పక్షాలు, సంబంధిత శాఖల అధికారులందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందిగా కోరారు. ఈ సమయంలో కొత్త కార్యక్రమాలు, శంకుస్థాపనలు ఉండరాదన్నారు. కోడ్ అమలులోకి వచ్చినందున అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదని చెప్పారు. ఎన్నికలతో సంబంధం ఉన్న ఏ ఒక్క అధికారీ జిల్లాలో గాని, ఇతర జిల్లాల్లో గాని రాజకీయ నాయకులకు సంబంధించిన ఎటువంటి సమావేశాలకు హాజరు కాకూడదని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇన్‌ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎమ్మెల్సీ బరిలో ప్రధాన పార్టీలు

ఓటు వినియోగించనున్నారు. దీంతో మొత్తం ఓటర్లు 838 మందిగా చెప్పొచ్చు.

**పార్టీల పైరవీలు...**

స్థానిక సంస్థల ఎన్నికలంటేనే గ్రామాల్లో గ్రూపులాట. ఒక గ్రూప్ ఒక పార్టీలో ఉంటే మరో గ్రూప్ ఎదుటి పక్షంలో ఉండడం సహజం. ఈ ఎన్నికల్లోనూ ప్రజాప్రతినిధులు అలానే ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ప్రతిపక్ష వైసిపికి అత్యధిక ఓట్లు 615 వరకూ ఉన్నాయి. కూటమికి 200 వరకూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పై చేయి కోసం కూటమి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వైసిపి పైకి లేచేందుకు బలాన్ని నిలుపుకోడానికి ఉమ్మడి విశాఖ జిల్లా అంతటా తమ కేడర్‌ను, ప్రజాప్రతినిధులతో గడిచిన కొద్దిరోజులుగా సమావేశాలు నిర్వహిస్తూ ఎమ్మెల్సీ కైవసానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.

# స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా చూస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి గెలుపొందిన నాయకులు ఇప్పుడు ప్రధాని మోడీకి చెప్పి ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం నాటికి 1227వ రోజుకు చేరాయి. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు ఆధ్వర్యాన చేపట్టిన దీక్షల్లో జగదాంబ జోన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఉందని, మోడీతో రాష్ట్ర నేతలు మాట్లాడి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, బంగార్రాజు, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, సిమ్మ నాయుడు, సూరకాజు, రమణ, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

## బుక్కా వీధి కుళాయిల్లో పురుగులతో నీరు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 38వ వార్డు పరిధి బుక్కావీధిలో కుళాయిల నుంచి పురుగులతో కూడిన నీరు వస్తోందని, ఇది దుర్వాసన కలిగి ఉంటుందని, ఈ నీరు తాగి ప్రజలు డయేరియా, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులకు గురై మంచాన బారిన పడుతున్నారని, తక్షణం కుళాయిల ద్వారా మంచినీరు అందేలా చూడాలని సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం బుక్కావీధి మహిళలతో కలిసి జివిఎంసి కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. నెల రోజుల నుంచి ఈ సమస్య ఉందని, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, కమిషనర్ జోక్యం చేసుకొని పరిష్కరించాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుక్కావీధి మహిళలు చిన్నతల్లి, కారి లక్ష్మి, కె.సింహాచలం, సూరీడు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 26 నుంచి జాతీయ మీడియా సదస్సు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** రాజస్థాన్ రాష్ట్రంలోని మౌంట్ అబూలో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ ముఖ్య కేంద్రం వద్ద జాతీయ మీడియా సదస్సు నిర్వహించనున్నట్లు బ్రహ్మ కుమారీస్ సంస్థ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సెప్టెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు జరగబోయే జాతీయ మీడియా సదస్సుకు విశాఖ జర్నలిస్టులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు. దేశం నలు మూలల నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొంటారన్నారు. ఆరోగ్యం, ఆధ్యాత్మికతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. విశాఖలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ చానల్స్ మీడియా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 27న ఆరోగ్యకర - సంతోష కర సమాజం ఆధ్యాత్మిక సాధికారత - మీడియా పాత్ర అంశం మీద జాతీయ సదస్సు జరుగుతుందని, 28న పాజిటివ్, నెగెటివ్ డ్యామెన్షన్ ఆఫ్ సోషల్ మీడియా అంశంపై ప్లీనరీ సెషన్ ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 24న విశాఖలో మీడియా ప్రతినిధులు బృందం రైలులో రాజస్థాన్ బయలు దేరుతారని తెలిపారు. 29న అక్కడ పలు ప్రాంతాలను చూపించనున్నట్లు వివరించారు. మౌంట్ అబూ వచ్చే జర్నలిస్టులు ఈనెల 12వ తేదీలోగా ఆధార్, సంస్థ గుర్తింపు కార్డును వాట్సాప్ ద్వారా పంపాలని తెలిపారు. వివరాలకు 8555857990 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సీతల్, జర్నలిస్టులు గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్, ఎంఎంసి అనాటమీ హెచ్ఒడి డాక్టర్ లక్ష్మణరావు, బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు సిద్ధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ,అనూరాధ పాల్గొన్నారు.



## శిబ్దాస్ ఘోష్ ఆలోచనలు నేడు అవసరం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఈ యుగపు గొప్ప మార్క్సిస్టు తత్వవేత్తలలో శిబ్దాస్ ఘోష్ ఒకరని, అతని ఆలోచనలు, ఆచరణ నేటి సమాజానికి అవసరమని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.గోవిందరాజులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు శిబ్దాస్ ఘోష్ 48వ వర్ధంతిని సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిబ్దాస్ ఘోష్ మహోన్నత ఆలోచనలను, మహత్తర జీవిత పోరాటాన్ని లోతుగా అర్థం చేసుకొని, ఆచరించడం అత్యంత ఆవశ్యకం అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర ఘోష్, బిఎస్.అమర్‌నాథ్, సిహెచ్ ప్రమీల పాల్గొన్నారు.



## 21న ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జి విడుదల

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ జెడ్9ఎస్ సిరీస్‌ను ఈ నెల 21న విడుదల చేయనుందని సంస్థ ప్రతినిధి మీడియాకు తెలిపారు. ఐక్యూ 'జెడ్' సిరీస్‌ను యువత కోసం తయారైందని తెలిపారు. వారి వేగవంతమైన జీవనశైలికి అనుగుణంగా ప్రత్యేకమైన డిజైన్, పనితీరు, అధునాతన కెమెరా సెటప్, ఖచ్చితమైన కలయికను కలిగి ఉంటుందని వివరించారు.

# చెత్తను క్లియర్ చేస్తే ఉత్తమ ర్యాంకు

**జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్**

**భీమిలి, కాపులుప్పాడ డంపింగ్ యార్డుల పరిశీలన**

ప్రజాశక్తి -మధురవాడ/ భీమిలి : కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ బయో మైనింగ్ ప్లాంట్‌లో లెగసి వేస్ట్ ఎక్కువగా ఉందని, దీని వల్ల స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించలేక పోతున్నామని జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తే 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గార్బేజ్ ఫ్రీ సిటీ ర్యాంకింగ్‌లో సెవెన్ స్టార్ రేటింగ్ జివిఎంసికి దక్కడం ద్వారా ఉత్తమ ర్యాంకు వస్తుందని. సోమవారం కాపులుప్పాడ బయోమైనింగ్ ప్లాంట్‌ను సందర్శించి, జిగ్నా సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లో ఏళ్ల తరబడి పేరుకుపోయి ఉన్న చెత్తను క్లియర్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన సూచనల మేరకు ఇప్పటికే గడచిన ఐదేళ్లలో నాలుగు దశల్లో 8 లక్షల టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామని, మరో లక్ష టన్నుల చెత్త ఉందన్నారు. త్వరితగతిన లెగసీ వేస్ట్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు మెకానికల్ కృష్ణారావును ఆదేశించారు. భీమిలి డంపింగ్ యార్డ్ సందర్శనలో ముందుగా గార్బేజ్ క్లోజ్డ్ కంప్రెషన్ మిషన్ పనితీరును పరిశీలించారు. ఇక్కడ వర్మీ కంపోస్ట్, విండ్రోస్ కంపోస్ట్ కేంద్రాలను సందర్శించి వర్మీ కంపోస్ట్ కేంద్రంలో పలు పైపులను మార్చాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు. అనంతరం రాసా ఇన్నా సంస్థ తయారుచేసిన మొబైల్ కాంపాక్టర్ బిన్ పనితీరును పరిశీలించారు. క్లాప్ వాహనాల ద్వారా నగరంలో వ్యర్థాల తరలింపుకు వీలుగా మొబైల్ కాంపాక్టర్ బిన్‌ను సూచించారు. అనంతరం తగరపువలస అన్న క్యాంటీన్ ఆధునీకరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని భీమిలి జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మిని ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, రెండవ జోనల్ కమిషనర్ శైలజ వల్లి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎఎంహెచ్ఒ డాక్టర్ ఎన్. కిషోర్, ఇఇ మెకానికల్ దిలీప్, ఎఇ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు పరిశీలనలో జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

## '22ఎ' తొలగింపు కుదరదు!

ప్రజాశక్తి -గాజువాక : అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీలోని సర్వేనెంబర్ 137/3లోని భూములను 22ఎ నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని బాధితులు రెవెన్యూ అధికారులకు వేడుకున్నారు. గాజువాక ప్రాంతానికి డి రమణ, సూర్యారావు, టివిఎస్ అప్పారావు, రాజు, మంగవేణి, తదితరులు 2012లో సమృద్ధి వెంచరు రమణారెడ్డి ద్వారా భూములు కొనుగోలు చేశారు. తర్వాత అవి 22ఏ పరిధిలో ఉన్నాయని తెలిసినా బాధితులు తమకు న్యాయం చేయాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారికి మొరపెట్టుకున్న వీరు, తర్వాత డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి విన్నవించారు. దీనిపై డిటి స్పందిస్తూ, 22ఏ జాబితాలో ఉన్న నిషేధిత భూములను దాని నుంచి తొలగించడం కుదరదన్నారు. తమకు న్యాయం జరగాలంటే ఏంచేయాలని బాధితులు వేడుకోగా, అది తమ పరిధిలో లేదని స్పష్టం చేశారు. అప్పట్లో ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఎన్ఓసి కూడా ఇచ్చారని విన్నవించగా, దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులకు రాశామన్నారు. దీంతో ఆవేదన చెందిన బాధితులు, తమకు భూమిని విక్రయించిన రమణారెడ్డిని నిలదీద్దామంటూ ఆవేశంగా వెనుదిరిగారు.

## సమిష్టిగా సమస్యలను పరిష్కరించుకుందాం

ప్రజాశక్తి -మధురవాడ : సమిష్టిగా ముందుకు సాగి సమస్యలను పరిష్కరించుకుందామని అల్లిపురం, సీతంపేటకు చెందిన మటన్ వ్యాపారులు షేక్ హుస్సేన్, షేక్ యాసిన్ అన్నారు.సోమవారం పీఎంపాలెం ఉస్మానియా ముస్లిం కాలనీలోని ఈద్గా వద్ద నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన చికెన్, మటన్ వ్యాపారాలు చేసే ముస్లిములు సమావేశమయ్యారు. ఏళ్లతరబడి ఇదే వ్యాపారంతో జీవనోపాధి పొందుతున్న తమలో అనేక మందికి నేటికీ సొంత ఇళ్లు, దుకాణం లేక, రోడ్డు పక్కన ఎపుడు ఉంటామో, ఊడుతామో తెలియని వ్యాపారాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పాలకులపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించు కోవాలంటే అందరం సమిష్టిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా ముస్లిం కాలనీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రెహమాన్, టిడిపి మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్బాషా, షేక్ అత్తాఫ్, షేక్ మదీన, షేక్ అక్తర్, ఎస్.కె.నాగూర్, బురాన్, బాబి, షేక్ సలీమ్, ఎస్.కె. నాగు, అప్పాసాహెబ్, రెహమాన్ పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సూర్యప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పిల్లలను కాలేజీలకు పంపుతున్న తల్లిదండ్రులు, వారి చదువు, ప్రవర్తనపై ఒక కన్నేసి ఉంచాలని సూచించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ పిఒ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు

## వరి సస్యరక్షణపై సూచనలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద గ్రామంలో వరినాట్లు వేస్తున్న పంటపొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివకోమలి సోమవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పైపైనే నాట్లు వేస్తే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉందని, నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30సెంటీమీటర్ల బాట తీయడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి పైరు ఎదుగుదలతో పాటు చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు.కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది హరీష్, రమేష్ పాల్గొన్నారు

## లింగ సమానత్వంపై అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి: లింగ సమానత్వంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో దీనిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ హ్యూమన్ రైట్స్ సభ్యురాలు, సోషల్ వర్కర్ జి.కోమలి మాట్లాడుతూ మానవ శరీరంలో హార్మోన్స్ ఇన్‌బ్యాలెన్స్, ట్రాన్స్‌జెండర్లు వంటి వాటిపై ప్రజల్లో అపోహలు పోయి, అవగాహన రావాలన్నారు. ఆదర్శ్ కాలేజ్ కరస్పాండెంట్ టి.థియోఫిలోస్ మాట్లాడుతూ, లింగ సమానత్వంపై తప్పుగా అర్థం చేసుకుంటే అనర్థాలు వస్తాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా పాల్గొన్నారు

## బాలికల గురుకులాన్ని భీమిలి రప్పించాలి


ప్రజాశక్తి -భీమునిపట్నం : వసతి, సౌకర్యాలు లేవన్న కారణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మండలంలోని మత్స్యకార గ్రామమైన అన్నవరంలో ఏర్పాటుకు మంజూరైన మహాత్మా జ్యోతీరావు పూలే బిసి వెల్ఫేర్ ఫిషర్‌మెన్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం, అమృతపురం పంచాయితీకి గతంలోనే తరలించారని, దీన్ని మంజూరైన అన్నవరంలోనే ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అధికసంఖ్యలో మత్స్యకారులు ఉన్న భీమిలి పట్టణంలోనే మత్స్యకార బాలికల గురుకులాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించి, పూర్తి సదుపాయాలతో భీమిలికి సంబంధిత గురుకులాన్ని రప్పించే చర్యలు తీసుకోవాలని కోరారు.

# వరుస చోరీలతో ప్రజల బెంబేలు

**తాళాలు వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా దొంగతనాలు**

**పోలీసు గస్తీ పటిష్టం చేయాలని స్థానికుల వేడుకోలు**

ప్రజాశక్తి -గాజువాక : పారిశ్రామిక ప్రాంతంగా పురోభివృద్ధి చెందుతున్న గాజువాక ప్రాంతంలో వరుస దొంగతనాలు స్థానిక ప్రజలకు భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న గాజువాకలో గడిచిన కొద్దిరోజులుగా వరుస చోరీలు ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నెల రోజులుగా ప్రతి ఏరియాలో ఏదో ఒక దగ్గర ఏదో ఒక దొంగతనం జరుగుతూనే ఉంది. కాలనీకి దూరంగా ఉన్న ఇళ్లను, తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల మింది గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి వేళ చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. రెండురోజుల క్రితం శీలానగర్‌లో ఒక చిరు వ్యాపారి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లోకి చొరబడిన దొంగలు, షాపులో ఉన్న 30 పాలు ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. తాజాగా కణితి రోడ్డులోని ఒక దుకాణం షట్టర్ కోసి, లోపలికి దూరం కౌంటర్‌లోని నగదును అపహరించుకు పోయారు. తాళాలు వేసిన ఇళ్లు, జనావాసాలకు దూరం గా ఉన్నవాటిలోనూ నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను చోరీ చేస్తున్న దొంగలు, పాన్‌షాపులు, హోటళ్లు, డెయిరీ పార్లర్లు, ఇతర దుకాణాల్లోనూ చొరబడి అందిన కాడికి దోచుకుపోతున్నారు. ఇవేకాకుండా బయటకు చెప్పుకోలేనంత తక్కువ మొత్తంలో నగదు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లే చోరీలు లెక్కలేనన్ని జరుగుతున్నాయి. చిన్నపాటి దొంగతనాలకు కేసులు పెట్టేందుకు పోలీసు స్టేషన్‌కు ఏం వెళతాములే అనుకుని పలువురు బయటకు చెప్పలేని స్థితి ఉంది.



గాజువాకలో తాళం వేసిన ఇంట్లో చొరబడి చోరీ చేసిన దొంగలు(ఫైల్)

గాజువాకలో ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న స్క్రాప్, ఇతరత్రా చిన్న దుకాణాలు, అందులో పనిచేసేందుకు వస్తున్న కొత్త వ్యక్తులు ఎవరో, ఏమిటో తెలియకుండా పెట్టుకోవడం ఈ చోరీలకు కారణమనే వాదన ఉంది. రాత్రి వేళల్లో తాళాలు వేసిన దుకాణాలు, ఇళ్లను టార్గెట్‌చేసి దొంగతనాలకు పాల్పడుతున్నా వాటిని నియంత్రించడంలో పోలీసులు విఫలమౌతున్నారనే విమర్శలూ ఉన్నాయి. గతంలో మాదిరిగా పటిష్టమైన పోలీసు గస్తీ లేకపోవడం కూడా చోరీలకు ఆస్కారమేర్పడుతుందనే ఆరోపణలూ ఉన్నాయి. పాతగాజువాక నుంచి కొత్త గాజువాక వరకు ప్రధాన రోడ్డులో మాత్రమే అక్కడక్కడా పోలీసు గస్తీ కనబడుతున్నా, ఇతర వీధుల్లోనూ, ఇతర ప్రాంతాల్లో తగినంతగా లేకపోవడం కూడాతాజా పరిస్థితికి కారణమంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రాంతీయ పటిష్టమైన గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేరాలు ఘోరాలు

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి :అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం మారేపల్లి- తెలుగుపూడి రహదారిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మారేపల్లి గ్రామానికి చెందిన అల్లు అప్పారావు (40) డీజిల్ మెకానిక్‌గా ట్రక్టర్లు రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 3న శనివారం మధ్యాహ్నం కల్లం వద్ద నుంచి వెళ్లిన అప్పారావు ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం తెలుగుపూడి- మారేపల్లి రహదారిలో చెరుకు తోటలో అప్పారావు మృతదేహాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు అక్కడికి వెళ్లి చూసేసరికి గుర్తుపట్టలేని స్థితిలో అప్పారావు మృతదేహం ఉండడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై మృతుని భార్య దుర్గలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై డి.నాగేంద్ర ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. మృతుడు అప్పారావుకు దుర్గ లక్ష్మి, పిల్లలు శ్యామ్ కళ్యాణ్, పూర్ణ చందు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలోని పెనుగొల్లు జాతీయ రహదారి వద్ద టిప్పర్, లారీ ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. సోమవారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో పెనుగొల్లు గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు (55) టీ తాగేందుకు జాతీయ రహదారి ప్రక్కన ఉన్న టీం టైంకు వస్తున్నాడు. తుని నుండి విశాఖ వైపు వెళుతున్న టిప్పర్‌ని వెనుక నుండి వేరొక లారీ ఢీ కొట్టింది. దీంతో ముందున్న లారీ రోడ్డుపై వస్తున్న బత్తిన అప్పారావును ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమవడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందినట్లు తెలిపారు. స్థానిక హైవే పెట్రోలింగ్ ఎస్ఐఐ దేవన్న ఘటనా స్థలికి చేరి మృతదేహాన్ని నక్కపల్లి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువు ఆక్రమణపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని అనంతవరం గ్రామపంచాయతీ పరిధిలోని కుంటువాని చెరువు ఆక్రమణపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు. ఆ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గేదెల చంద్రరావు. మరికొంతమంది రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అనంతవరం సర్పంచ్ గొర్రుపాటి వెంకటలక్ష్మి భర్త గొర్రుపాటి జీపివై నాయుడు చెరువును ఆక్రమించి, రోడ్డు వేయాలని చూస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అనుమతులు తెచ్చుకున్నానని, ఇపుడు పనులు చేస్తున్నారని, వాటిని వెంటనే నిలుపుదల చేయాలని కోరారు.

**సర్పంచ్ భర్త జివివై నాయుడు వివరణ**

దీనిపై అనంతవరం ప్రస్తుత సర్పంచ్ జి వెంకటలక్ష్మి భర్త జిపివై నాయుడు వివరణ కోరగా, 15ఏళ్ల క్రితం కుసులవాడ గ్రామానికి చెందిన. పార్థసారథి నుంచి 10.54 సెంట్లు జిరాయితీ భూమిని కొనుగోలు చేశానన్నాడు. అదే భూమిని ఆనుకొని ఉన్న 80 సెంట్లు అసైన్డ్ భూములను మూడు కుటుంబాల నుంచి కొనుగోలు చేసినా, రెండేళ్ల తర్వాత గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో 80సెంట్లు భూమిని సబ్‌స్టేషన్‌కు కేటాయించారన్నారు. తాను ఎక్కడా చెరువును ఆక్రమించలేదని స్పష్టం చేశారు.

## ఇళ్ల స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో సర్వేనెంబర్ 276, 305, 306 సర్వే నెంబర్లలో అక్రమంగా నిర్మించిన 150 పైగా ఇళ్లస్థలాలు దురాక్రమణకు గురయ్యాయని తహశీల్దార్ శ్యాంప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం స్థాపించారు. ఆక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారిపై పూర్తి దర్యాప్తు జరిపి కాపాడాలని కోరారు, టిడిపి నాయకులు మీసాల సత్యనారాయణ, సియాద్రి రాంబాబు, ఎం రామారావు, కొయ్య నాని పాల్గొన్నారు.

## డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస: విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి, వాటి జోలికి పోవద్దని ఎస్ఇబి ఎస్ఐ చిన్నంనాయుడు సూచించారు.సోమవారం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయితోపాటు హెరాయిన్, కొకైన్ వంటి డ్రగ్స్ కలిగి ఉండడం, వినియోగించడం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరంగా చేపట్టే చర్యలపై వివరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్ పండా, అధ్యాపకులు పాల్గొన్నారు

# త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి, చందక గ్రామాల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తికావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కాంట్రాక్టర్లు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, నీటి సరఫరా కొరత లేకుండా చూస్తామని, మూడు మాసాల్లో నిర్మాణాలు పూర్తికావాలని ఆదేశించారు. సోమవారం విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవిన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 20,23లో 283 మంది ఇల్లు మంజూరు కాగా 191 నిర్మాణాలు, చందక గ్రామంలోని సర్వే నెంబర్ 4లో 205 ఇళ్లమంజూరు కాగా190 ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అధిక ప్రాధాన్యత ఇస్తూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో గృహ నిర్మాణాలపై అపోహ ఉందని, దాన్ని విడనాడాలన్నారు. అన్ని గ్రామాల్లో గృహనిర్మాణాలతోపాటు మౌలిక సౌకర్యాలకు అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు.

ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ డి.అఖిల, గనులు శాఖ డీడీ డిఇవిఎస్ఎస్ఎన్ రాజు, తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపిడిఓఅప్పలనాయుడు, ఇఇ సత్యనారాయణ, డిఇఇలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఇ సూర్యప్రకాశ రావు, వర్క్ ఇన్స్పెక్టర్లు, గ్రామ కార్యదర్శులు ప్రసాద్ పాల్గొన్నారు.



కృష్ణాకాలనీ డిపోలో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

**ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలన**

మధురవాడ : జివిఎంసి ఎనిమిదోవార్డులోని ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్‌తో మాట్లాడి, రామానాయుడు స్టుడియో సమీపంలోని ప్రభుత్వ భూముల వివరాలను అడిగి తెలుసుకుని వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి పనుల కోసం అందుబాటులో ఉన్న భూములను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

**కృష్ణా కాలనీ ఇసుక డిపో పరిశీలన**

భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన ఇసుక సరఫరా విధానం పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ హరిధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జివిఎంసి మూడో వార్డు కృష్ణాకాలనీలో ఉన్న ఇసుక డిపోను పరిశీలించారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఇసుకను నిల్వ చేసుకోవాలని, సజావుగా, సులభతరంగా సరఫరాకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. డిపోలో ఇసుక నిల్వలపై గనులశాఖ ఉప సంచాలకులను అడిగి తెలుసు కున్నారు. మండల తహశీల్దార్ పి.రామారావు పాల్గొన్నారు.

## గంజాయి అరికట్టేందుకు కఠిన చర్యలు



పోలీసులకు సూచనలు చేస్తున్న డిసిపి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి- పెందుర్తి : గంజాయి అరికట్టడానికి కఠినచర్యలు తీసుకోవాలని డిసిపి- 2తుహిన్ సిన్హా ఆదేశించారు. సోమవారం పినగాడి, సరిపల్లి కూడలిని సందర్శించారు. ఇటీవల గంజాయి అక్రమ రవాణా ఈ కూడలి మీదుగానే ఎక్కువగా సాగుతోందన్న ఆరోపణలతోపాటు పలువురు ఇక్కడే పట్టుబడడంతో అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయిని పట్టుకోవడంలో పోలీసులు ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. అల్లూరి మన్యం నుంచి ఎక్కువగా మైదాన ప్రాంతానికి రవాణా జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి, ప్రతిదాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గంజాయి నివారణపై దిశానిర్దేశం చేశారు. త్వరితగతిన పెండింగ్ కేసులు పరిష్కరించాలని సూచించారు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిఐ రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గ్రామపంచాయతీల అభివృద్ధిపై ఎన్ఐఆర్డి ప్రతినిధి కె.నాగరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రణాళికా లక్ష్యాలు, ఎలా అమలు జరుగుతున్నాయో వివరించారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పన దిశగా పనిచేయాలన్నారు ఎంపిడిఓ నీలం అప్పలనాయుడు, ఇఓపిఆర్డి రామారావు, మండల ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి కె.రాజేష్ , గ్రామ కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, ఎం సతీష్ పాల్గొన్నారు

## వైద్య విజ్ఞానంపై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం: సీజనల్, దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ, వైద్యసేవలపై గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలకేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మండలంలోని ఆర్ఎంపిలకు విజయనగరం ఎస్‌వి హాస్పిటల్ వైద్యులు జనరల్, పీడియాట్రిక్ సర్జన్ .డాక్టర్ జి.అనిల్‌కుమార్, దంతవైద్యనిపుణులు డాక్టర్ టి.శిరీష, సుగర్, థైరాయిడ్, హార్మోన్ సంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ నవ్యశృతి పాల్గొని, సాధారణ, దంత వ్యాధులపై ఆర్ఎంపిలకు వైద్యవిజ్ఞాన అవగాహన కల్పించారు. ఆర్ఎంపిల సంఘం మండల అధ్యక్షుడు.ఆర్. అప్పారావు. ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పలువురు ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

## పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న త్రినాథరావు

ప్రజాశక్తి -ఆనందపురం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల గ్రంథాలయానికి అదే పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దింటి త్రినాథరావు సోమవారం 50 పుస్తకాలను అందజేశారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక తరపున రూ.1450 విలువ చేసే 50 పుస్తకాలను హెచ్ఎం రామకృష్ణ పట్నాయక్‌కు త్రినాథరావుఅందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రామకృష్ణ పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు లైబ్రరీలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాలు వితరణ చేసిన త్రినాథరావును అభినందించారు. పిఇటి ప్రసాద్ ఉన్నారు.

### ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో

## ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల నూతన కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బిఐ డిజిఎం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్, విశాఖపట్నం మాడ్యుల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పంకజ్‌కుమార్ మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం కోసం ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం పాటుపడాలని. ఏవైనా సమస్యలుంటే మేనేజ్‌మెంట్ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి తప్పక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌బిఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో సంఘం న్యాయకత్వం, సభ్యులు ముఖ్య భూమిక పోషించాలని కోరారు.

ఎస్‌బిఐ ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్ మేడికొండ మాట్లాడుతూ సంఘ కార్యాలయం ఏర్పాటుకు సహకరించిఇన బ్యాంకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానమైన పే బ్యాక్ టు ది సొసైటీ నినాదంతో తమ సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా ఎయు కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, ఎయు ఉద్యోగులు డాక్టర్ బి మృత్యుంజయ, రవి రాజు వ్యవహరించగా బ్యాంకు రీజనల్ మేనేజర్లు ఐ.సుబ్రహ్మణ్యం, సంజిత్ కుమార్, దేబానాద్, అభిషేక్ కుమార్ చీఫ్ మేనేజర్ జిఎస్ఆర్ మూర్తి, సంఘ బాధ్యులు కె.సతీష్, పి.వి.రమణ బాబు, సిహెచ్ వికాస్, మాలతి, కె.సౌందర్య, అనిత, వి.కిరణ్ పాల్గొన్నారు

## బిసిజి టీకాతో క్షయవ్యాధి నివారణ

ప్రజాశక్తి-ఆనందపురం : క్షయ వ్యాధి నివారణకు బిసిజి టీకాలు తప్పనిసరి వేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గంగునాయుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు మండలంలో 4526 మందిని బిసిజి టీకాలు వేయాలని ఎంపిక చేశామని, వారిలో 3114 మందికి ఇప్పటిక వ్యాక్సినేషన్ చేశామ న్నారు. ప్రతి సోమ, గురువారాల్లో సచివాలయాల్లోనూ, ఆరోగ్య కేంద్రాల్లో బిసిజి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఆనందపురం సచివాలయంలో ఎంఎల్‌హెచ్‌పి సౌందర్య ఆధ్వర్యంలో బిసిజి టీకాలు వేశారు కార్యక్రమంలో ఎఎన్ఎం పైడిరాజు, పి అన్నపూర్ణ, ఎం.పద్మావతి, ఎల్ పద్మ, ఆశావర్కర్ దొంతల వెంకటలక్ష్మి పాల్గొన్నారు

## విశాఖ అధ్యాపకులకు డాక్టరేట్‌లు




అధ్యాపకులను అభినందిస్తున్న విశాఖ కాలేజీ యాజమాన్యం

ప్రజాశక్తి- పెందుర్తి :నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వివిధ విభాగాల అధ్యాపకులకు డాక్టరేట్లు లభించాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ఎస్‌పి తేజస్వినికి మొబైల్ అడహాక్ నెట్‌వర్క్స్‌లో డైనమిక్ సోర్స్ రౌటింగ్ ప్రోటోకాల్ అంశంపై పరిశోధనకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. . ఫిజిక్స్ విభాగానికి చెందిన డాక్టర్ ఎం.ఉదయ భాస్కర్‌కు 'క్రిస్టల్ నానో మెటీరియల్స్, వాటి అనుసంధిత సాంకేతిక పరికరాలపై పరిశోధన చేసి కోయంబత్తూర్ భారతి యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది.ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ బి.జీవన్‌రావుకు నానో టెక్నాలజీలో సెమీకండక్టర్ ఆధారిత జంక్షన్‌లెస్ ట్రాన్సిస్టర్ విశ్లేషణ అంశంపై పరిశోధనకు నిట్ మిజోరం యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ జి. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రదీప్ వర్మ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ శాంతారావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది వారిని అభినందించారు.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- గాజువాక: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ బంగారు షాప్ షోరూమ్‌ను సోమవారం గాజువాకలో ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఇటువంటి షోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ హస్తకళ ప్రావీణ్యంతో, అత్యుత్తమైన డిజైన్లతో విభిన్న ఆభరణాలు గాజువాక షోరూంలో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయ న్నారు. ప్రధానంగా డైమండ్ జ్యువెలరీ, ఏరా అన్కట్ డైమండ్‌జువెలరీ, డివైన్ హెరిటేజ్ జువెలరీ, ఎత్నిక్స్ హ్యాండ్ క్రాఫ్టెడ్ జ్యువెలరీ, ఫేషియ జేమ్‌స్టోన్ జువెలరీ, విరాజ్ పోల్కి జువెలరీ వంటివి మలబారు ప్రత్యేక బ్రాండ్లతో పాటు, వివిధ పండుగలకు సరిపోయే బంగారం, వజ్రాలు, విలువైన రత్నాలు, వెండి ప్లాటినం ఆభరణాలు లభిస్తాయన్నారు. శ్రావణ మాసం పురస్కరించుకొని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ప్రతి కొనుగోలుతో ఉచిత వెండినాణాన్ని ఇస్తామని, ఈ ఆఫర్ ఈనెల 18 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. వన్ ఇండియా వన్ గోల్డ్ రేటు, ఫెయిర్ ప్రైస్ ప్రామిస్ ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల్లోని మలబార్ షోరూంలలో స్థిరమైన బంగారం ధరలు ఉంటాయన్నారు. పారదర్శకత, నాణ్యతలతో వినియోగదారుల విశ్వాసమే లక్ష్యంగా మలబార్ సేవలు అందిస్తోందన్నారు.

1993లో స్థాపించబడి, ప్రపంచవ్యాప్త ఖ్యాతి పొందిన మలబార్ గోల్డ్‌కు ఆస్ట్రేలియా, కెనడా, యూకె, యూఎస్ఎ, భారత్ వంటి 13 దేశాల్లో 350కిపైగా షోరూంలు, 14హోల్‌సేల్ యూనిట్ కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద జ్యువలరీ రిటైలర్‌గా ఆరవ స్థానంలో ఉన్న మలబార్‌గోల్డ్‌కు డిలిట్ గూగుల్ పవర్ ఆఫ్ లగ్జరీ గూడ్స్-2023 ర్యాంకింగ్‌లో 19వ స్థానంలో సొంతం చేసుకుందన్నారు. పాత బంగారం అమ్మేటప్పుడు బంగారానికి 100శాతం విలువ అందించే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆభరణాల షాపింగ్‌మాల్ మలబార్ గోల్డ్ అన్నారు కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, స్టాలిన్ పాల్గొన్నారు.



మలబార్ గోల్డ్ షోరూం ప్రారంభిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

# స్కీం వర్కర్లపై రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలి

## సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాశక్తి- అనకాపల్లి**

స్కీం వర్కర్లపై రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా స్కీం వర్కర్లపై వేధింపులు, తొలగింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం, వివోఏ, అంగన్వాడి, ఆశా, విఆర్‌పి, గ్రామపంచాయతీ కార్మికులను 800 మందిని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగాల్లోంచి తొలగించారని తెలిపారు. దీంతో కొంత మంది స్కీం వర్కర్లు ఆత్మహత్యా ప్రయత్నం చేశారన్నారు. జిల్లాలోని అచ్యుతాపురం మండలంలో ఇద్దరు పంపు ఆపరేటర్లను తొలగించారని, మధ్యాహ్న భోజన పథకం ఆర్పీలపై రాజకీయ ఒత్తిడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందిన వారు ఉద్యోగాల నుంచి తొలగిపోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారురు. ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరింపులు తొలగింపులు ఉండవని చెబుతున్నా, కింది స్థాయిలో నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తక్షణమే వేధింపులు ఆపాలని, తొలగించిన వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా ప్రభుత్వ స్కూల్ స్వీపర్లు, కసింకోట, తుమ్మపాల గ్రామపంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, శ్రీదేవి, జానకి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు చిన్నారావు, అప్పారావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు, స్కీమ్ వర్కర్లు


రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

## జోరుగా అనకాపల్లి-చోడవరం రోడ్డు మరమ్మతులు

**ప్రజాశక్తి- అనకాపల్లి**

అనకాపల్లి-చోడవరం మెయిన్ రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ రోడ్డు పూర్తి శిథిల స్థితికి చేరడంతో వర్షం పడితే చెరువులా మారిపోయే పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు వర్షాకాల సమయం, రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్ యాక్సిడెంట్లో వారి కుటుంబ సభ్యులను కోల్పోవడం జరిగింది. దీనిపై పలుమార్లు దినపత్రికల్లో వార్తలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ సమస్యను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన స్పందించి సుమారు రూ.30 లక్షల రూపాయలతో తాత్కాలిక మరమ్మతులకు నిధులు విడుదల చేశారు. దీంతో ఈ రోడ్డులో మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

## ఘనంగా షేక్ రియాజ్ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

టిడిపి మైనారిటీ సెల్ నాయకులు షేక్ రియాజ్ జన్మదిన వేడుకలు అనకాపల్లి పట్టణం రెడ్ చెర్రీ బేకరీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ళ సురేంద్ర, 83వ వార్డు టిడిపి ఇంచార్జ్ బొద్దపు ప్రసాద్, 82వ వార్డు ఇంచార్జ్ పోలరపు త్రినాథ్ కేక్ కటింగ్ చేయించి దుస్సాలువాతో రియాజ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మళ్ళ రామ్ బుజ్జి, మళ్ళ సంతోష్, పిట్ల రాజు, పొలిమేర ఆనంద్, ఆకుల నానాజీ, పి సాయిరాజ్, జనసేన నాయకులు యాండ్రా రామకృష్ణ, ఎంద్ర సన్యాసిరావు, గణేషు, మణికంఠ, అఖిల్, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు బి సెట్ హేమ, కోట్ని ఉమా, కాయలు ప్రసన్న, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటకరంగ కళాకారుడు ఈశ్వరరావుకు నివాళి

**ప్రజాశక్తి -అనకాపల్లి**

అనకాపల్లి జిల్లా, కొండకొప్పాక ప్రాంతానికి చెందిన, సీనియర్ దర్జీ సంఘ నాయకులు, నాటక రంగ కళాకారులు మిర్దిపాటి ఈశ్వరరావుకు సోమవారం ఆయన స్వగృహంలో దర్జీలు కళాకారులు నివాళులర్పించారు. ఆయన కుమారులు, హరనాథ్, రాజేష్, సత్య జనార్ధన్లకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ నవ్యంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్య నారాయణ, కోటిపల్లి కగేస్, కె. మహేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## డైట్‌లో అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**ప్రజాశక్తి-అనకాపల్లి**

స్థానిక డైట్ కళాశాలలో అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే కళాశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. దుర్గా శ్యామ్ ప్రసాద్, సీఎస్ఎండీ విభాగాధిపతి ఎ.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 100 కొత్త కంప్యూటర్లతో ఏర్పాటు చేసి ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మేనేజమెంట్ రూ.50,00,000 లక్షలు వెచ్చించి ఈ కొత్త టెక్నాలజీకి అనుగుణముగా సాఫ్ట్వేర్‌ను ఇన్స్టాల్ చేయడం జరిగిందని చెప్పారు.

## డిగ్రీ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-చోడవరం**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ భర్తీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.కిరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 10వ లోపల కళాశాలలో అందజేయాలన్నారు. ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులకు గాను ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎంటెక్ కంప్యూటర్, ఎంసిఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లలో 55శాతం ఉత్తీర్ణత కలిగి వారు అర్హులని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్ అండ్ స్లెట్ అర్హత పొందినవారు, అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 12వ తేదీన ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

## టిడిపికి సంఖ్యా బలం లేకుండా

# ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎలా నిలుపుతారు

## మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

**ప్రజాశక్తి-చోడవరం**

సంఖ్యా బలం లేకుండా చంద్రబాబు నాయుడు తమ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎలా నిలుపుతారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి అధిష్టానం బొత్స పేరు ఖరారు చేయడంతో చోడవరం మాడుగుల నియోజకవర్గాల జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీలతో చోడవరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు వైసిపికి 615 మంది ఉన్నారన్నారు. కనీసం 300 మంది కూడా లేని టిడిపి అభ్యర్థిని నిలబెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రలోభాలతో గెలుద్దామని చూడడం సిగ్గుచేటన్నారు. కనీసం ఆరు నెలలైనా టిడిపి కూటమి ప్రభుత్వ పనితీరును చూద్దామనుకుంటే సూపర్ సిక్స్ పథకాల అమలు చేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. ప్రభుత్వ పనితీరుకు నిరసనగా వైసిపి శ్రేణులు ఏకమై ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాలక పక్షం కళ్ళు తెరిచేలా విజయం సాధించాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ వైసిపిని పనికట్టుకుని అప్రతిష్టపాలు చేయడానికి మరి కొందరు ప్రచారం చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ అబద్దాలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పథకాల అందివ్వడంలో మొండిచేయ చూపడంతో ప్రజల నుండి వంద రోజుల్లోపే వ్యతిరేకత వ్యక్తమవుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ఉన్న వైసిపి ప్రజా ప్రతినిధులు అందరూ బొత్స విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్ రాజు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, నాలుగు మండలాలకు చెందిన వైసిపి ఎంపీపీలు, జడ్పిటిసి, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

### బొత్సతో వైసీపీ నాయకుల భేటీ

**సబ్బవరం :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థి బొత్స సత్యనారాయణని విశాఖపట్నంలో ఆయన నివాసంలో సోమవారం ఉదయం పెందుర్తి నియోజకవర్గ వైసిపి నాయకులు గండి రవికుమార్, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మర్యాదపూర్వకంగా కలిశారు. బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇచ్చి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి బాబు, యడ్ల నాయుడు, సబ్బవరం సర్పంచ్ ఢిడ్డం ప్రసాద్, సియాద్రి బాల, యర్రంశెట్టి రాము, సిరపరపు వాసు, గురి శ్రీనివాస్, కరక రాము, గోలగాని రమేష్ పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని వినతి

**ప్రజాశక్తి -అనకాపల్లి :** అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుండి డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను అమ్మి బాధితులకు డిపాజిట్లకు తిరిగి చెల్లించి వారి ప్రాణాలు కాపాడాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు ఆయన కార్యాలయంలో సోమవారం బాధితులు విన్నవించారు. 10 సంవత్సరాల కావస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల అనేకమంది బాధితులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకుని చనిపోయారన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం, చదువుల కోసం దాచుకున్న సొమ్ము పది సంవత్సరాలు అయినా రాకపోవడంతో నిరాశ చెందిన బాధితులు ఆత్మహత్యల బాట పట్టకముందే కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా డిపాజిట్లు తిరిగి చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కొణతాల రామకృష్ణ స్పందిస్తూ ఇది న్యాయమైన సమస్య అని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వైఎన్ .భద్రం, అధ్యక్షులు కర్ణం మాణిక్యాలరావు, కార్యదర్శి ముల్లేటి గోపాల రమణ, పి. శేషు, ఎన్నం శెట్టి సూరిబాబు, రామ అప్పారావు, జె దుర్గారావు, కొణతాల శ్రీనివాసరావు, ఎం శేషు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సహాయం

**ప్రజాశక్తి -అనకాపల్లి**

జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమ్యూనికేషన్ విభాగంలో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన పి.శ్రీనివాసరావుకు సోమవారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,83,400 చెక్‌ను తన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు ప్రశంసాపూర్వకమైన విధులు నిర్వహిస్తూ, పోలీసు శాఖకు మెరుగైన సేవలు అందించాడని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ బి.శారద, జూనియర్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణపై అవగాహన పెంచాలి

**ప్రజాశక్తి- కశింకోట**

కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని క్షయవ్యాధి జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి, ఎస్‌టిఎస్ వెంకటరమణ సోమవారం సందర్శించారు. పిహెచ్‌సిలో క్షయవ్యాధి తాలూకా రికార్డులు, కార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అయ్యప్ప రెడ్డి వివరించారు. కసింకోట పిహెచ్‌సి అధికారి డాక్టర్‌యశోద మాట్లాడుతూ ప్రతి కేసును ప్రతి నెల ఫాలోఅప్ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ ఫణి భూషణం, ఫీల్డ్ సూపర్వైజర్ రామ్మూర్తి, ఫీల్డ్ స్టాఫ్ సుభాని, హనుమంతు, పాల్గొన్నారు

## పిఎసిఎస్‌లో సభ్యుల వివరాలు అందించాలి

**ప్రజాశక్తి-దేవరాపల్లి**

దేవరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సభ్యులంతా కంప్యూటీకరణ నేపథ్యంలో వివరాలు అందజేయాల్సి ఉందని ఆ సంఘం సీఈవో ఎన్.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సభ్యత్వం ఉన్న ప్రతి రైతు తన ఆధార్ జెరాక్స్‌తో పాటు మొబైల్ నెంబర్‌ను సంఘ కార్యాలయానికి అందించాలన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బాబూరావు కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-కశింకోట**

మండలంలోని బయ్యవరం గ్రామంలో టిడిపి కూటమి నాయకుల వేధింపులకు గురై మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న వైసిపి నాయకుడు గొల్లవిల్లి బాబురావు కుటుంబాన్ని వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి 50 వేలు ఆర్థిక సహాయాన్ని భరత్ కుమార్ అందజేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలి

## రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడుకు సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

గొర్రెలు, మేకలు పెంపకందారులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్, పెద్దబ్బాయి మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలి గొర్రెలు మేకలు మృత్యువాత పడుతున్నాయని, నివారణ కొరకు వెంటనే అన్ని రకాల నాణ్యమైన టీకాలు, డీ వార్మింగ్ మందులు ఉచితంగా అందించాలని కోరారు. ఆర్‌బికెలకు నెలకు రూ.10వేలు విలువైన పశువుల మందులు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం ద్వారా 90శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మించాలని, ప్రతి పెంపకందారునికి 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షలు రుణం ఇవ్వాలని కోరారు. ప్రమాదాలు, వివిధ రకాల జబ్బులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల చనిపోయే జీవాలకు ప్రభుత్వమే ఉచితంగా బీమా చేసి ఒక్కో జీవానికి రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రమాదాల వల్ల మృతి చెందిన గొర్రె కాపరులకు రూ.20 లక్షలు, సాధారణ మరణాలకు రూ.5 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న పశువైద్యులను, పశు వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 50 శాతం సబ్సిడీతో రూ.15వేలు విలువగల మేలు రకం విత్తన పొట్టేలు ఇవ్వాలని కోరారు. గొర్రెలు, మేకల ప్రాథమిక సహకార సంఘాలకు ఐదు నుంచి 25 ఎకరాలు స్థలం కేటాయించాలని, ఊరు ఉమ్మడిగా ఉన్న పశువుల మేత భూములు కాపాడాలని, ఎన్నికల హామీ మేరకు 50 సంవత్సరాలు నిండిన పెంపకందారులకు పింఛన్లు మంజూరు చేయాలని, గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి తోట తిరుపతిరావు పాల్గొన్నారు.


మంత్రికి సమస్యలను తెలియజేస్తున్న సంఘం నాయకులు


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కశింకోట

మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రాత్రి పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు అమీర్ సాహెబ్, ఎస్‌టిపి చారి, పందిరిభై, నాగేశ్వరరావు, సాయిబాబు, ఎల్ఎస్ఎన్ పాత్రుడు, లక్ష్మీ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జట్ల రాజేష్, కుందేం గణేష్, మట్టా రమేష్, మల్లేపు గోపి, బత్తిన గణేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, నిర్వాహకులు

## 26న మదర్ థెరిసా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ స్కూల్లో అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 26న మదర్ థెరిసా 114వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం దీనికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ప్రత్యేక కార్యక్రమాలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టివి.శేషగిరి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఎస్.పేటలో విదేశీ పక్షుల సందడి

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఎఎస్.పేటలో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. వీటిని చూసేందుకు పలువురు తరలి వస్తున్నారు. భారత్‌లో తెల్లకొంగగా పిలవబడే ఈ రకం కొంగలు గుంపులుగా ప్రతి ఏడాది జులై, ఆగస్టు మాసాల్లో ఎఎస్.పేటలోని చింతచెట్టుపై బస చేయడం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. చింత చెట్టు చిగురు ఆకులు ఆహారం ఈ పక్షులు తింటా ఉంటాయని, ఆగస్టు తరువాత వేరే ప్రాంతానికి తరలిపోతాయని అంటున్నారు.

## రాజాం పాల సంఘం అధ్యక్షునిగా రమణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

బుచ్చియ్యపేట మండలం రాజాం గ్రామం విశాఖ డెయిరీ సొసైటీ అధ్యక్షునిగా నడిపిల్లి రమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమణను, డైరెక్టర్లుగా ఎన్నికైన మరిశా సత్యారావు, మంత్రి వరహాలమ్మ విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం డైరెక్టర్లు, మాజీ ఎంపిటిసి మరిసా సతీష్, మండల తెలుగు రైతు అధ్యక్షులు మరిసా నరేష్, రాజాం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


రమణను సన్మానిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల

# చెట్టు నరికివేతపై రెవెన్యూ సీరియస్

## వాల్టా చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని అటవీశాఖకు విజ్ఞప్తి
## ప్రజాశక్తి వార్తకు స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి ఆర్ అండ్ బి గెస్టు హౌస్ ఆవరణలో పురాతన రావి వృక్షాన్ని శనివారం నేల కూల్చడంపై 'యథేచ్ఛగా చెట్లు నరికివేత' శీర్షికన ప్రజాశక్తి ఆదివారం ప్రచురించిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆర్ఐ విష్ణు, విఆర్ఎల విచారణ అనంతరం స్థానిక మండల డిప్యూటీ తహశీల్దార్ మురళి సోమవారం అటవీ శాఖకు తాఖీదు జారీ చేశారు. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. చెట్టు నరికివేతపై ప్రజాశక్తి ప్రభుత్వ అధికార్లను అప్రమత్తం చేసిన తీరును అభినందించారు. చెట్టు నరికివేతలో దొరికిన కలప దుంగలు తమ అధినంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. గెస్టుహౌస్ ఎవరి పరిధిలో ఉందన్న ప్రశ్నకు నోటీసుల అనంతరం బయటపడుతుందని చెప్పారు. తమ పరిధిలోనిది కాదని ఇప్పటికే ఆర్ అండ్ బి ఇంజనీర్ వివరణ ఇచ్చారు. ఎన్‌హెచ్ఎఐ పరిధిలోనిదంటున్నారు. కోట్ల విలువైన స్థలం ఎవరి పరిధిలోనిదన్న దాంట్లో ఇంత గందరగోళం దశాబ్దాలుగా కొనసాగుతున్నా ఇప్పటికీ స్పష్టత రాకపోవడం విచారకరం.


నరికివేసిన చెట్టు (ఫైల్‌ఫోటో)

ప్రభుత్వ గెస్టు హౌస్ ఆవరణలో రిటైర్డ్ వాచ్ మెన్ కుటుంబం నివాసముంటుంది. చెట్టు నరకమని, దానికి చలానా కట్టాలని ఆర్ అండ్ బి ఏఇ మౌఖికంగా తనకు ఆదేశాలిచ్చారని ఆ కుటుంబం 'ప్రజాశక్తి'కి చెప్పారు. ఆ ఇంజనీరు ఫోన్, పేరు అడగ్గా వివరాలు తనకు తెలీవని చెప్పారు. రెవెన్యూ అధికార్లకు ఇదే సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఇదంతా విచారణలో నిగ్గుతేలుతుందని స్థానికులు భావిస్తున్నారు.

# స్థానిక ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

ప్రజాశక్తి- అనకాపల్లి


మాట్లాడుతున్న వైసిపి నేత భరత్‌కుమార్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ పార్లమెంట్ సభ్యులు భీశెట్టి వెంకట సత్యవతి, వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు వైయస్సార్ పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిటీసీలు, కార్పొరేటర్లు, జడ్పిటిసిలు వైయస్సార్ పార్టీకి చెందిన ఓటర్లలో 550కు పైగా ఉన్నారని, గెలుపు వైసిపిదేనని తెలిసి కూడా కూటమి నాయకులు కొనుగోలే లక్ష్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఏ ప్రభుత్వం వల్ల మనకి పదవి అధికారాలు వచ్చాయో అందుకు విలువ నిచ్చే సమయం ఇదేనన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల గళం విప్పి అందరి తరపు మాట్లాడే సమర్థుడైన నాయకుడు బొత్స సత్యనారాయణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరు దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, జెడ్‌పి కో ఆప్షన్ సభ్యులు పెతకంశెట్టి జోసెఫ్, వైసిపి నాయకులు జాజుల రమేష్, మళ్ల బుల్లిబాబు, కలగా గున్నయ్య నాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కొణతాల భాస్కర్, పెంటకోట శ్రీను, ఎవి రత్నకుమారి, నమ్మి గణేష్, వైస్ ఎంపిపి ఐతా రాము, విల్లూరి చంద్రశేఖర్, కేఎం నాయుడు, పిల్లా రాజు, బీశెట్టి యశ్వంత్, బీశెట్టి జగన్, కరకా సోమునాయుడు ఎంపిటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## దర్శిని కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాంబిల్లి మండలం కొప్పుగొండపాలెం గ్రామంలో జూలై 6న హత్యకు గురైన బద్ది దర్శిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు వినతిపత్రం అందజేశారు. మైనర్ బాలికను అత్యంత కిరాతకంగా నరికి చంపేసిన ఘటనపై పోక్సో యాక్టు ప్రకారం, నిర్భయ రిలీఫ్ ఫండ్ కేటాయించాలని, బాధిత కుటుంబానికి పునరావాసం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, మాట్లాడుతూ దర్శిని హత్యపై స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అనిత స్పందించారని, ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మీడియా పరంగా తెలియజేశారని గుర్తు చేశారు. కాని ఘటన జరిగి నెలరోజులు కావస్తున్నా నేటికీ ఆ కుటుంబాన్ని ఏ విధంగానూ ఆదుకోలేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సకాలంలో స్పందించి, సంబంధిత పోలీస్, రెవెన్యూ అధికారులు కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, ఐద్వా మహిళా సంఘం ఆర్ లక్ష్మి, కొప్పుగొండపాలెం మాజీ సర్పంచ్ బద్ది వెంకటరమణ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సహారా ఇండియా డిపాజిట్ సొమ్ము తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

సహార ఇండియా డిపాజిట్ దారులకు డిపాజిట్ చేసి,న సొమ్ము వెంటనే చెల్లించాలి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న డిమాండ్ చేసారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి బిటి దొర అధ్యక్షతన జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పైసా పైసా కూడా బెట్టి భవిష్యత్తులో ఉపయోగపడతాయని పొదుపు చేస్తే సహారా ఇండియా సంస్థ మోసం చేసిందని తెలిపారు. దీంతో లబ్ధిదారులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి లబ్ధిదారులందరికీ డబ్బులు పంపిణీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిహెచ్ దేముడు, డి శంకర్, కె ఈశ్వరరావు, జె ఈశ్వర్రావు, బి నాగేశ్వరరావు, వి దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

## ఎఎల్ పురంలో పశు వైద్య శిబిరం

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని మేజర్ పంచా యతీ ఏఎల్ పురం శివాలయం వద్ద స్థానిక పశు వైద్యురాలు శిరీష ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చోద్యం పశు వైద్యులు రామ్మోహన్ హాజరయ్యారు. ఈ శిబిరంలో 25 గైనిక్ కేసులు, 650 జీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కేడీపేట పశువైద్య సహాయకులు, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# వరి పొలాల్లో కాలి బాటలు తప్పనిసరి

**ప్రజాశక్తి-నక్కపల్లి:**వరిలో కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉద్దండపురం, గొడిచెర్ల, చినరామభద్రపురం గ్రామాల్లో పర్యటించారు. వరి నాట్లు, వరి ఆకుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. వరి నారు పీకే వారం రోజుల ముందు కార్బో ఫ్యూరాన్ గుళికలు ఐదు సెంట్లు వరి నారుమడిలో 800 గ్రాములు ఇసుకలో కలిపి జల్లుకోవాలన్నారు. వరి నారు తీసి నాట్లు వేసుకునేటప్పుడు కొనలు తుంచి నాటుకోవాలని, దీంతో చీడల ఉధృతిని తగ్గించ వచ్చునన్నారు. దమ్ము చేపట్టి ఎకరానికి ఎరువులు సింగిల్ సూపర్ ఫాస్పేట్150 కేజీలు, యూరియా 30 కేజీలు, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దమ్ములో తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. వరి నాటిన తరువాత ప్రతి 2మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయాలని, దీంతో పైరుకు గాలి, వెలుతురు బాగా తగులుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ధర్మసాగరంలో 'పొలంబడి'

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**మండలంలోని ధర్మసాగరం గ్రామంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టీ.శ్రీదేవి మాట్లాడుతూ, పొలంబడిలో 30 మంది రైతులకు 14 వారాల పాటు శిక్షణ ఇస్తామని, వరి పంట నాట్లు వేసినది మొదలుకొని కోత కోసే దశ వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఏడిఎ డిఆర్‌సి పి.శ్రీదర్‌రావు మాట్లాడుతూ పొలంబడిలో 14 వారాలలో విత్తన శుద్ధి, విత్తన మొలక శాతం, మట్టి నమూనాల సేకరణ, నారుమడి యాజమాన్యంపై వివరించారు. మండల వ్యవసాయాధికారి డి.అప్పారావు మాట్లాడుతూ; తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే పంటలను పండించాలన్నారు. మాకవరపాలెం వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజేత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దర్శకులు, నటులు

## నాటికలో విద్యార్థులకు అవకాశం

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:**ఈ నెలలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సాంఘిక రంగంలో వినూత్న ప్రయోగం చేపట్టినట్లు ద్విశత నాటక దర్శకుడు కొప్పిశెట్టి సత్య శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో గ్రామ నాయకుడు కోన అప్పలరాజు నేతృత్వంలో శ్రీకృష్ట జన్మాష్టమికి గ్రామంలోని విద్యార్థినులతో లక్ష్మణగీత సాంఘిక నాటకం రిహార్సల్స్‌ను మునగపాక గ్రామానికి చెందిన నాటక రచయిత దాడి జగన్నాధరావు, గ్రామపెద్దల సమక్షంలో ప్రదర్శించారు. విద్యార్థినులంతా పదిహేను నుండి ఇరవై రెండు సంవత్సరాలలోపు వారు కావడం విశేషం. ఈ నాటకం తిలకించేందుకు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత రానున్నందున దానికి తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ నాయకుడు అప్పలరాజు తెలిపారు.

# వర్గీకరణలో రెల్లిలకు న్యాయం చేయాలి

### రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పాపారావు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**వర్గీకరణలో 5 శాతం రెల్లిలకు సమన్యాయం జరగకుంటే న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి అన్ని రంగాలలో వెనుకబడిన రెల్లి కులస్తులకు 5శాతం రిజర్వేషన్ కేటాయించా లన్నారు. ఏపీలో రెల్లిలు 30 లక్షల జనాభా ఉన్నప్పటికీ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపుతూ అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్ వర్తింపజే యాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వరప్రసాద్, భూపతి, అప్పారావు, బర్రా రమణ, ముత్యాల సూరిబాబు, వడ్డాది అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు



వినతిపత్రం అందజేస్తున్న గాయత్రి

## ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

### యుటిఎఫ్ వినతి

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**నర్సీపట్నం నియోజక వర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఎన్నికల డ్యూటీ సర్టిఫికేట్ ఇప్పించాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు పీ.గాయత్రి కోరారు. ఈ మేరకు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో యూటీఎఫ్ నర్సీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. 2024 ఎన్నికల విధుల నిర్వహణ కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 12, 13, 14 తేదీల్లో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొనడం జరిగిందన్నారు. ఎన్నికల డ్యూటీ సర్టిఫికేట్ ఇంకా ఇవ్వలేదన్నారు. తక్షణమే వీటిని అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ నాయకులు చిట్టయ్య, నర్సీపట్నం మండల కన్వీనర్ సాంబమూర్తి, గొలుగొండ మండల ప్రధాన కార్యదర్శి శోభన్ పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని పాతకృష్ణదేవిపేట పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి ఆధ్వర్యంలో పల్లావూరు వద్ద నీటి ట్యాంకుల వద్ద పారిశుద్య పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. అంతేకాకుండా నీళ్ల ట్యాంకు సమీపంలో ఉన్న ఇళ్ల బయట చెత్తను ట్రాక్టర్ సహాయంతో పరిశుభ్రం చేయించారు.

## జలాశయంలో మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి-కొత్తకోట:** అదృశ్యమైన గిరిజన యువకుని మృతదేహం కల్యాణపులోవ జలాశయంలో లభ్యమైందని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు.. దూకులంపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు (35) శనివారం ఉదయం జలాశయంలో చేపల వేటకు వెళ్లాడని చెప్పారు. చేపల పట్టుకునేందుకు వెళ్లిన చిన అప్పారావు ప్రమాదవ శాత్తు జలాశయంలో జారీ పడి ఉండవచ్చునని ఎస్ఐ పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఆచూకీ కోసం ప్రయ త్నం చేయగా సోమవారం మధ్యాహ్నం మృతదేహం లభ్యం అయ్యిందని తెలిపారు. శవ పంచనామా అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించామన్నారు.

# తల్లిపాలు బిడ్డలకు దివ్యౌషధం



నాతవరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని లింగంపేట గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, విజయలు మాట్లాడుతూ, బిడ్డలకు ఖచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలతో బిడ్డకు ఎన్నో పోషకాలు అందటంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎం.సత్యవతి, టీ.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**నాతవరం:** మండలంలో డి.యర్రవరం పంచాయతీలో వై.డి.పేట అంగన్వాడీ కేంద్రం-1లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసన్న తల్లిపాలతో కలిగే లాభాలు, ముర్రిపాలు ప్రాముఖ్యత, బిడ్డకు తల్లి పాలిచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎ.నాగజ్యోతి ఏ.విజయలక్ష్మి, అంగన్వాడీలు, తల్లులు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

**నక్కపల్లి:**మండలంలోని సీతంపాలెం, కాగిత, గునుపూడి తదితర గ్రామాల్లో సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. సీతంపాలెంలో తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ, తల్లిపాలలో పోషక విలువలు ఉంటాయన్నారు. ఇవి బిడ్డలకు ఎంతో శ్రేష్టమన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతి, పంచాయతీ కార్యదర్శులు నరసింగరావు, నరసింహ రాజు, సచివాలయ సిబ్బంది బ్యూలారాణి, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, సత్యవతి, అంగన్వాడీలు లక్ష్మీ, ఆమ్మాజీ, ఝాన్సీ, ఆశాలు పాల్గొన్నారు.

**మునగపాక**: మండలంలోని తోటాడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు సిడిపిఓ ఇంద్రా దేవి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. మండల వ్యాప్తంగా



మునగపాకలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అంగనవాడి టీచర్లు, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో తల్లిపాల విశిష్టత గురించి వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంద్రాదేవి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతప్రదాయని, బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదలతో పాటుగా సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మేడిచర్ల గ్రామంలో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైర్లు ఎం రాములమ్మ, ఎల్వి సుశీల మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు శ్రేష్టమైన పోషకాహారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

**అనందపురం:** తల్లి ముర్రుబాలు బిడ్డకు దివ్య ఔషధమని సిడిపిఒ శ్రీదేవి అన్నారు. సోమవారం ఆనందపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించడంతోపాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. గ్రామ కార్యదర్శి రామకష్ణ నాయుడు, అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు దొంతల కాసులమ్మ, పద్మ ధనలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది సౌందర్య, పైడిరాజు, డి లక్ష్మి పాల్గొన్నారు

**సీతమ్మధార** : జైప్రకాష్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల్లో ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఒ రమణకుమారి అన్నారు.గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.ఆరోగ్యవంతమైన చిన్నారులకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో ఆర్‌పి పేట పిహెచ్‌సి వైద్యాధికారి గౌతమి, మర్రిపాలెం సెక్టార్ సూపర్వైజర్ జెటిఎన్ జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ జయరాం

## కారిడార్ భూములపై ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి ఏపిఐఐసీ అధికారులతో నర్సీపట్నం ఆర్డీఓ జయరాం సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కారిడార్‌కు సంబంధించిన రోడ్డు, స్టార్ట్ అప్ జోన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. భూసేకరణకు సంబంధించి నిర్వాసితుల పరిహారం, ప్యాకేజీ ఇతర సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై నివేదిక అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపిఐఐసీ జనరల్ మేనేజర్లు శ్రీనుబాబు, పద్మజ, ఇన్చార్జి తహసిల్దార్ సత్యనారాయణ ,పలువురు అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు, విఆర్‌ఎలు

## సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి -చీడికాడ:సమస్యలు పరిష్కారం చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ రమేష్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఆర్.దేముడు నాయుడు మాట్లాడుతూ, అర్హులైన విఆర్‌ఎలకు అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. వేతనాలు పెంచాలని కోరారు. గ్రామ రెవిన్యూ సహాయకులు రెవెన్యూ వ్యవస్థలో అనేక రూపాలలో ప్రజలకు సేవలు అందిస్తున్నా సుప్రీం కోర్టు ప్రకారం కనీసం వేతనం అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు నాగేష్, జి తాతబాబు, రమణ, ప్రసాద్, .నాయుడు, రవణమ్మ, గణేష్ పాల్గొన్నారు.



పల్లాను సత్కరిస్తున్న కాంట్రాక్టర్లు

## పల్లాను కలిసిన జివిఎంసి కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సహాయ సహకారాలు ఉండాలని, జివిఎంసి పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతో జివిఎంసి కాంట్రాక్టర్లకు సమావేశం ఏర్పాటు చేయాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రంధి సాధురావు, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, ఆర్.ఎ.నాయుడు కన్వీనర్ రాజన వెంకటరావు, జాయింట్ సెక్రటరీ గణేష్, మెంబర్లు సూర్యనారాయణ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# 19, 20వ తేదీల్లో విపిజెఎ ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (విపిజెఎ) ఆధ్వర్యాన ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించనున్న 185వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే పోస్టర్‌ను సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. జివిఎంసి సహకారంతో ఏటా బీచ్ రోడ్‌లోని విశాఖ మ్యూజియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పిఎన్.మూర్తి, కార్యదర్శి జి.తిరుపతిరావు మాట్లాడుతూ, ఈ నెల 19న ఉదయం 10:30 గంటలకు ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. విశాఖ ఫొటో జర్నలిస్టులు ఈ ఏడాదిలో తన కెమెరాలో బంధించి అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించనున్నారని చెప్పారు. రెండు రోజులపాటు వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు, యువత, పర్యాటకులు కూడా సందర్శిస్తారని తెలిపారు.పోస్టర్ ఆవిష్కరణలో విశాఖ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్

# రణధీర్ కుటుంబాన్ని పరామర్శించిన నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అనారోగ్యంతో గత నెల 27న మృతిచెందిన రణధీర్ కుటుంబాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యారామ్, ప్రజా నాట్యమండలి నాయకులు గుర్రం రమణ సోమవారం సాగర్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. సిపిఎం విశాఖ జిల్లా పూర్వ కార్యదర్శి జె.సత్తిరాజు మనవడు, నేవల్ డాక్‌యార్డు సిఐటియు క్రియాశీల సభ్యుడు జ్యేష్ఠ వెంకటేశ్వరరావు కుమారుడు రణధీర్ మృతి అత్యంత విచారకరమని, కుటుంబానికి తీరని లోటు అని నర్సింగరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని ఓదార్చారు. మంగళవారం సాగర్‌నగర్‌లో జరిగిన రణధీర్ పెద్ద కర్మ కార్యక్రమానికి నాయకులు విచ్చేసి నివాళులర్పించారు.



రణధీర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నర్సింగరావు, తదితరులు

# శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో.. శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా 'శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. దేవాలయ కార్యనిర్వహణాధికారి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, తదుపరి అమ్మవారికి విశేషపూజ నిర్వహించారు. వచ్చే నెల 3వ తేదీ వరకు ఈ శ్రావణలక్ష్మి పూజలకు అవసరమయ్యే పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చనుంది. ఈ ప్రత్యేక పూజా రుసుం రూ.400గా నిర్ణయించారు. పూజ అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, రాగి స్టాండు యంత్రం ప్రసాదంగా ఇవ్వబడునని కార్య నిర్వహణాధికారి తెలిపారు. పరోక్షముగా పూజ చేయించుకోదలచిన భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంటు నెంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ UBIN0806081కు జమచేస్తూ వారి పేరు, గోత్రం, అడ్రసును 8985515989 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ పంపాలని కోరారు. ఆన్‌లైన్ సేవలు, పూజలు టిక్కెట్లు aptemples.ap.gov.in website ద్వారా లభిస్తాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు సిహెచ్‌వి.రమణ, సహాయ కార్యనిర్వహణాధికార్లు వి.రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, పి.రామారావు, సహాయ ఇంజినీరు కె.సూర్యనారాయణ మూర్తి తెలిపారు.

## గంటాతో టిడిపి ఇన్‌ఛార్జి సత్య భేటీ

-స్థాయి సంఘం, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో టిడిపి ఇన్‌ఛార్జి దామచర్ల సత్య సోమవారం ఎంవిపి.కాలనీలోని గంటా శ్రీనివాసరావు నివాసంలో భేటీ అయ్యారు. జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి ఇద్దరూ కొంతసేపు ముచ్చటించారు. జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకునేలా పార్టీ శ్రేణులను సమాయత్తం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న అభ్యర్థుల గురించి, విజయం సాధించడానికి ఏ రకంగా ముందుకు వెళ్లాలనేది మాట్లాడుకున్నారు. గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై చర్చించారు.

**గంటాను కలిసిన స్థాయీ సంఘం అభ్యర్థులు**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్థాయీ సంఘానికి పోటీ చేస్తున్న పివి.నరసింహం, బొమ్మిడి రమణ, బల్ల శ్రీను, గొలగాని వీరారావు, విల్లూరి భాస్కరరావు, నొల్లి నూకరత్నం శనివారం ఆయన నివాసంలో కలిశారు. విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని అభ్యర్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, టిడిపి నాయకులు గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు తదితరులు ఉన్నారు.

## వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : కేరళలో వరద బాధితుల సహాయార్థం షిప్‌యార్డు మెయిన్ గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన సోమవారం విరాళాలు సేకరించారు. షిప్‌యార్డు ఉద్యోగులు స్పందించి రూ.20 వేలు విరాళాలు అందించారు. ఈ విరాళాలను సిఐటియు జిల్లా కమిటీకి అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన ప్రతి ఒక్క ఉద్యోగికీ షిప్‌యార్డు సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బిఎస్‌ఎన్.రాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాంజీ అంబేద్కర్, ట్రెజరర్ పి.ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# పారా అథ్లెట్ విజేతలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: బెంగళూరు కంఠీరవ స్టేడియం వేదికగా జులై 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్ -2024లో గెలుపొందిన క్రీడాకారులను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం అభినందించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు కె.తేజశ్రీ లాంగ్ జంప్‌లో బంగారు పతకం, 100 మీటర్స్‌లో రజత పతకం, ఎం.సాయి నిఖిల్ గౌతమ్ 1500 మీటర్స్‌లో కాంస్య పతకం, జి.సూర్య రోహిత్ 100 మీటర్స్‌లో కాంస్య పతకం, 400 మీటర్స్‌లో కాంస్య పతకం, బి.లక్ష్మణ 100 మీటర్స్‌లో రజతం, 400 మీటర్స్‌లో బంగారు పతకం, కె.గౌతమ్ 400 మీటర్స్‌లో రజతం, లాంగ్ జంప్‌లో బంగారు పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని విశాఖపట్నం జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ గిరీష్, పారాస్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ వి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ వికలాంగుల సేవా సంస్థను సందర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహారాణి పేటలో సంపూర్ణ వికలాంగుల సేవా సంస్థను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వికలాంగులు స్వయం కృషితో తయారుచేస్తున్న ఆహార వస్తువులు, బొమ్మలు, నేత వస్తువులను పరిశీలించారు. వికలాంగులు తయారు చేస్తున్న వస్తువుల వివరాలు, సహాయ సహకారాలు గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పలువురు దాతల సహకారంతో ఏర్పాటుచేసిన అప్పడాల మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విన్నకోట రమణమూర్తి, రాజేశ్వరి, స్థానిక జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## డిఎస్‌సి, టెట్‌పై 7న ఉచిత అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఎస్‌సి, టెట్‌పై ఉచిత అవగాహనా సదస్సు డాబాగార్డెన్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ పి.సతీష్ తెలిపారు. ప్రముఖ కోచింగ్ నిపుణులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో పాటు మరికొందరు నిష్ణాతులు పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సులో 160 పేజీల విద్యా మనో విజ్ఞాన శాస్త్ర మెటీరియల్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డిఎస్‌సి, టెట్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా 9347205549 నెంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

## పిల్లల పరికరాలను సద్వినియోగం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 30వ వార్డులోని విఎంసి పాఠశాలలో నడుస్తున్న భవిత కేంద్రం పిల్లల కోసం సమకూర్చిన పరికరాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేయాలని భవిత జిల్లా నిర్వాహకులు అమ్ము నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ గీత కోరారు. భవిత కేంద్రాన్ని సోమవారం వారు సందర్శించారు. ఈ కేంద్రానికి కొత్తగా సమకూర్చిన టిఎల్‌ఎం, యాక్టివిటీ కార్డ్స్, ఫిజియోథెరపీ పరికరాలు, టీచర్ చైర్స్, పరిల్లెల్ బార్స్, పిఇజి బోర్డ్స్ తదితర పరికరాలను వారు పరిశీలించారు. తల్లిదండ్రులకు, పిల్లలకు, భవిత టీచర్లకు పలు సూచనలు చేశారు. డైలీ లివింగ్ యాక్టివిటీస్, సోషలైజేషన్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫిజియోథెరపీ యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఎం.ఆనంద్, పి.ప్రియ, పాల్గొన్నారు.

## బిఎస్‌హెచ్ నూతన శ్రేణి ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషిన్ విడుదల

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : బిఎస్‌హెచ్ హోమ్ అప్లయెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సిమెన్స్ ఫ్రంట్-లోడింగ్ వాషింగ్ మెషీన్ల సరికొత్త శ్రేణిని సోమవారం సిరిపురంలోని తమ సంస్థ కార్యాలయంలో విడుదల చేసింది. ఈ సందర్భంగా సంస్థ ఎమ్‌డి, సిఇఒ సైఫ్‌ఖాన్ మాట్లాడుతూ, 9-10 కిలోల లోడ్‌ను నిర్వహించగల సామర్థ్యంతో అత్యాధునిక సాంకేతికతతో ఈ వాషింగ్ మెషిన్లు తయారైనట్లు తెలిపారు. సిల్వర్, డార్క్ గ్రే, డార్క్ లేక్ రంగులలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. 2022 - 2023 వరకు 9 కిలోల ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్ల మార్కెట్ 70 శాతానికిపైగా వృద్ధిని సాధించాయని తెలిపారు.